విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

నిబద్ధతగల కమ్యూనిస్టు యోధుడు 'పరుచూరి'

పరుచూరి చిత్రపటానికి పూలువేసి నివాళులర్పిస్తున్న నాయకులు

విశాలాంధ్ర-కూచిపూడి : విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు భావాలపై ఆకర్షితులై చురుకైన కార్యకర్తగా, నాయకునిగా సేవలందించి నేటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ పరుచూరి చెన్నకేశవరావు అని వక్తలు కొనియాడారు. మొవ్వ మండలం పెదపూడి గ్రామానికి చెందిన అలనాటి కమ్యూనిస్టు నేత, ప్రజానాట్యమండలి కళాకారుడు పరుచూరి చెన్నకేశవరావు 20వ వర్ధంతి వేడుకలు కూచిపూడి పెదపూడి సెంటర్లోని చలసాని కాంచనరావు కమ్యూనిస్టు (సీపీఐ) భవనంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అఖిల భారత రైతు సంఘం అధ్యక్షులు రావుల వెంకయ్య పాల్గొని ప్రసంగించారు. విద్యార్థి దశలోనే దేశంలో ఉధృతంగా ఉన్న సమయంలో కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితులై తన మిత్రులు కాకర్ల గోపీచంద్, అయినంపూడి బాలకృష్ణ, డీపీఎస్ఆర్ సుబ్బారావుతో కలిసి స్టూడెంట్‌ఫెడరేషన్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటూ దివితాలుకా స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా పనిచేసి పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు పాటు పడ్డారని కొనియాడారు. అదేవిధంగా ప్రజానాట్య మండలి కళాకారులుగా పలు నాటకాలలో తనదైన శైలితో నటించి చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈ సందర్భంగా అలనాటి మధురస్మృతులను సభాముఖంగా జ్ఞప్తికి తెచ్చారు. స్వతహాగా కళాకారుడైన చెన్నకేశవరావు దివితాలూకా ప్రజానాట్యమండలి అధ్యక్షునిగానే కాకుండా కృష్ణాజిల్లా ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షునిగా కూడా కొనసాగి కళాకారులను వెలుగులోకి తెచ్చి ఆదరించారన్నారు. అలాగే గ్రామపంచాయతీ సభ్యునిగా కూడా పనిచేసి అప్పట్లో పంచాయితీ అభివృద్ధికి తన వంతు కృషి చేశారన్నారు. అప్పట్లో పెత్తందారులు ఈయనపై హత్యాయత్నం చేసినా ఎదురొడ్డి పోరాడి సీపీఐలో ప్రముఖపాత్ర పోషించారని అన్నారు. అప్పుడు కమ్యూనిస్టు నాయకులు దోనేపూడి దత్తు, కారుమూరి దేవసుందర్రావు, మల్లుపెద్ది రామసుబ్బయ్య, హనుమానుల వెంకటేశ్వరరావు, పరుచూరి శ్రీనివాసరావు, కాకర్ల గోపీచంద్, ఏవి గోపాలరావు, డిపిఎస్ఆర్ సుబ్బారావు, మల్లుపెద్దు కృష్ణమోహన్, వేములపల్లి రామ్మోహన్ రావు, వేమూరి రామయ్య తదితర నేతలతో కలిసి కమ్యూనిస్టు పార్టీ అన్నారు. కడవరకు ఎర్రజెండా అని అమితంగా ప్రేమించిన చెన్నకేశవరావుపై అభిమానం కొరవడలేదు అనటానికి నిదర్శనం ఈ సభకు అధిక సంఖ్యలో అభిమానులు హాజరవటమేనన్నారు. కమ్యూనిస్టు పార్టీ అధికారం లేకపోయినా ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుంటూ పేద వర్గాలకు వెన్నంటి ఉంటూ కేంద్ర, రాష్ట్ర స్థాయిలో పోరాటాల నిర్వహిస్తూ మరొక రెండు సంవత్సరాలలో శతాబ్ది వేడుకలు చేసుకోనున్న ఏకైక పార్టీ భారతకమ్యూనిస్టు పార్టీనేనని సభికుల హర్షధ్వానాల మధ్య పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులపై తీసుకున్న నిర్ణయాలతో ఢిల్లీలో నిరవధికంగా పోరాటాలు చేయటంతో తమ తప్పు తెలుసుకున్న ప్రభుత్వం ఒక మెట్టు కిందకు దిగి క్షమాపణలు చెప్పారంటే అది కమ్యూనిస్టు పార్టీ చేసిన పోరాట ఫలితమేనని స్పష్టం చేశారు. అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం రోడ్‌షోలు, పబ్లిక్ ప్రాంతాలలో బహిరంగ సభలో నిర్వహించరాదంటూ రాత్రి నల్లజీవోను విడుదల చేయడంతో కమ్యూనిస్టు పార్టీ చేసిన పోరాటంతో న్యాయస్థానం మందలించి, దానిని నిలిపివేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళతాం అనాలోచితచర్యగా ఆయన వక్కాణించారు. అధికారంలో లేకపోయినా "ఎర్రజెండా" పేదలు, బాధితులు వెనక వెన్నంటి ఉంటుందని పేర్కొంటూ కమ్యూనిస్టు పార్టీ అజరామరమని స్పష్టీకరించారు.

సీపీఐ పామర్రు నియోజకవర్గ కార్యదర్శి దగాని సంగీతరావు అధ్యక్షత వహించి ప్రసంగించిన ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారి ఆర్ పిచ్చయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి తాతయ్య, చెన్నకేశవరావు భార్య రాధాదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించిన వారిలో సభలో ప్రసంగించిన అతిథులతోపాటు కుటుంబ సభ్యులు పరుచూరి అజయ్‌కుమార్, దోనేపూడి సుమతి, తాతినేని కన్యాకుమారిలు, నాయకులు కోసూరు వెంకట అప్పారావు, చెరుకు శ్రీనివాసరావు, చందోలు నాగేశ్వరరావు, గోపిశెట్టి రంగారావు, గొట్టిపాటి నాగేశ్వరరావు, కాకర్ల చంద్రశేఖర రావు, బోరుకాటి నరసింహరాజు, దళపతిరావు వెంకటరామరాజు, అరుణ కుమార్, నారగాని సురేష్, కొండా నాగేశ్వరరావు, పాతపాటి ప్రసాద్, దగాని మోహనరావు, బళ్లా సుబ్బారావు, ప్రాజర్ల మేల్ రాజు, మహిళా నేతలు దగానిబుజ్జి, కొండేటి సలోమి తదితరులు తోపాటు కూచిపూడి, యద్దనపూడి, పెదపూడి, తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో అభిమానులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా అవనిగడ్డ నియోజకవర్గ సీనియర్ నాయకులు రావి బాబురావు మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం వహించి అమరవీరులకు నివాళులు అర్పించారు.

రావి బాబూరావు నేత్రాలు దానం చేసిన కుటుంబ సభ్యులు

విశాలాంధ్ర-చల్లపల్లి : నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి సమాజాన్ని చైతన్యపరచాలని వక్కలగడ్డ పీఏసీఎస్ చైర్మన్ హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అన్నారు. చల్లపల్లి మండలం వక్కలగడ్డలో సీపీఐ జిల్లా నాయకులు రావి బాబూరావు మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యుల అంగీకారంతో బాబూరావు నేత్రాలను దానం చేశారు. విజయవాడ ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది వక్కలగడ్డ చేరుకొని బాబూరావు నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తరలించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు మలుపెద్ది బోసు, ఓబులేసు, నాయకులు పాల్గొన్నారు. నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులను నాయకులు అభినందించారు.

మృతుని కుటుంబానికి సాయం

విశాలాంధ్ర-కూచిపూడి : పెదపూడిలో పొలంలో పాము కాటుకి గురై చికిత్స పొందుతూ మృతి చెందిన కుటుంబానికి రూ.10 వేలును తక్షణ సహాయంగా బుధవారం అందజేశారు. ఈ నెల 15వ తేదీన పాము కాటుకు గురైన అనగాని వీరరాఘవయ్య మొవ్వ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. వైయస్సార్ బీమా పథకం ద్వారా తక్షణ సహాయంగా రూ.10 వేలను ఆయన భార్య వీరరాఘవమ్మకు పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు, సర్పంచ్ భర్త తాతా రాంబాబు ద్వారా అందజేశారు. పెదపూడి సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ సోమయాజుల శ్రీరామాంజనేయులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దాడికి యత్నించిన నలుగురు యువకులకు రిమాండ్

విశాలాంధ్ర-మచిలీపట్నం : సోషల్ మీడియా వివాదంతో ఒక యువకుడిపై నలుగురు దాడిచేసిన ఘటన మచిలీపట్నంలో జరిగింది. పల్లపాటిఅభిరామ్ అనే యువకుడిపై మంగళవారం రాత్రి నలుగురు యువకులు దాడిచేయగా అభిరామ్‌ని కొందరు మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఆంధ్రహాస్పిటల్‌కి తరలించారు. ఘటన జరిగిన వెంటనే మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అభిరామ్‌ను పరామర్శించారు. ఈ విషయమై ఆర్ పేట సిఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పల్లపాటి అభిరామ్ అతనిపై దాడి చేసిన నలుగురిలో ఫేస్ బుక్ లో ఒకరిపై ఒకరు దుర్భాషలాడుకుంటూ ఉండేవారని, ఆ విషయమై మంగళవారం నాడు అభిరామ్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండ గా గాంధీ బొమ్మ శివాలయం సెంటర్లో అడ్డగించి ఈడేపల్లిలోని ఒక అపార్ట్మెంట్ ఆవరణంలో ఈ నలుగురు తీసుకొని వెళ్లి దాడి చేసిన జరిగిందని ఆయన తెలిపారు. ఈ నలుగురిపై 363, 307 సెక్షన్ల కింద కిడ్నాప్, హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్ పంపామని తెలిపారు.

'విశాలాంధ్ర-2023' క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ దారపు శ్రీనివాస్ విశాలాంధ్ర-2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు పత్రికా రంగంలో ఏడు దశాబ్దాలుగా సుదీర్ఘసేవలను అందిస్తూ పాఠకులను అలరించటం సామాన్య విషయం కాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికీ ప్రజలకూ మధ్య పత్రికలే వారధిగా నిలుస్తున్నాయనీ అభ్యుదయభావాలే ప్రధాన సిద్ధాంతంగా నడుస్తున్న విశాలాంధ్ర ప్రకృతి దృశ్యాలతో క్యాలెండర్‌ను రూపొందించటం అభినందనీయమని శ్రీనివాస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ బి.కనకదుర్గ, పంచాయతీల విస్తరణాధికారి వి.దిలీప్ కుమార్, కార్యాలయ ఉద్యోగులు ఎలిజబెత్‌రాణి, పీటర్, రవితేజ, రంగారావు, వీఆర్ఓలు, పాల్గొన్నారు.

మార్కెట్ యాడ్ చైర్మన్‌గా కొక్కిలిగడ్డ

విశాలాంధ్ర-అవనిగడ్డ : దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ యాడ్ చైర్మన్‌గా కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావుకు నియామక పత్రం అందాయి. కోడూరు మండలం పిట్టలంక గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డను నియమిస్తూ, నియామక పత్రాలను బుధవారం వెంకటేశ్వరరావు అందుకుని విలేకరులతో మాట్లాడారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు నియామక పత్రాన్ని అందచేశారని వెంకటేశ్వరరావు చెప్పారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఎంపీ వల్లభనేని బాలశౌరి, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, జిల్లా ఇంచార్జ్ మంత్రి ఆర్.కె రోజా, జిల్లా మంత్రి జోగి రమేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు వెంకటేశ్వరరావు తెలిపారు.

టీడీపీ నాయకులు శివరాం ప్రసాద్‌కు మండలి పరామర్శ

విశాలాంధ్ర-ఘంటసాల: టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ డిసి చైర్మన్ సూరపునేని శివరాం ప్రసాద్‌కు మాజీ ఉపసభాపతి మండల బుద్ధ ప్రసాద్ మండల పరిధిలోని తాడేపల్లి ఆయన స్వగృహంలో పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ సూరపనేని మాతృమూర్తి వెంకట లక్ష్మి మృతి చెందటం ఎంతో బాధాకరమని ఆమె మరణం ఆయన కుటుంబానికి గ్రామానికి తీరనిలోటని ఆవేదన చెందారు అనంతరం, మృతికి గల కారణాలను శివరాం ప్రసాద్ ని అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు తెదేపా మండల పార్టీ అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, అవనిగడ్డ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు దిరిసం వెంకట్రావు, శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్, శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్న), తాడేపల్లి గ్రామ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల భద్రతకు అందరూ బాధ్యతగా ఉండాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : ప్రతి ఒక్క అధికారి బాలికలకు అవగాహన కల్పించడంలో ముందుండి, మధ్యాహ్న భోజనాన్ని జిల్లా స్థాయి అధికారులు పరిశీలించాలని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్ లిని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో పాఠశాలలు, వసతి గృహాలకు అందించే ఆహారంపై జిల్లా స్థాయి అధికారులతో స్పెషల్ డ్రైవ్ ఫర్ గర్ల్స్ వీడియో కాన్ఫరెన్స్, సమీక్ష సమావేశం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలు, వసతి గృహాల్లో భోజనం వికటించకుండా అధికారులు పర్యవేక్షణ చేసి అవగాహన కల్పించాలని, ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే పరిశీలించి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. లింగ వివక్షపై ప్రజలకు అధికారులు సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్లో భ్రూణ హత్యలు జరక్కుండా వైద్యశాఖ పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు ఆదేశించారు. రక్తహీనత అనేది ఒక తీవ్రమైన ప్రపంచ ప్రజారోగ్య సమస్య అని జాయింట్ కలెక్టర్ అంటూ ఇది ముఖ్యంగా చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలను ప్రభావితం చేస్తుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో 42 శాతం గర్భిణీ స్త్రీలలో 40 శాతం రక్తహీనతతో బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసిందన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో కిషోర బాలికలు గర్భిణీ స్త్రీలు పాలింతలకు సమగ్రమైన పౌష్టికాహారం అందజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లాస్థాయి మండల స్థాయి అధికారులు నిరంతర పర్యవేక్షణ అయా కేంద్రాలపై ఉండాలన్నారు. ఈ సమావేశంలో చీఫ్ ప్లానింగ్ అధికారిణి వై. శ్రీలత, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరర్ నాయక్, ఐసిడిఎస్ పిడి సువర్ణ, డి ఆర్ డి ఏ పిడి ప్రసాద్, జిల్లా విద్యా, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

డీఏల చెల్లింపు ప్రకటన చేయాల్సింది ప్రభుత్వమా? ఉద్యోగ సంఘ నాయకులా?

విశాలాంధ్ర -చల్లపల్లి : రాష్ట్రంలో ఉద్యోగుల జేఏసీ పేరుతో ప్రముఖ ఉద్యోగ సంఘ నేతల వైఖరి లక్షలాది మంది ఉద్యోగులు, పెన్షనర్లను మధ్య పెట్టేలా ఉందని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు విమర్శించారు. చల్లపల్లి లో విలేకరులతో సురేష్‌బాబు మాట్లాడుతూ గతంలో పిఆర్సీపై, ప్రస్తుతం డిఏల చెల్లింపులపై జేఏసీ నేతల అత్యుత్సాహ పత్రికా ప్రకటనలు ఇందుకు ఉదాహరణలు అన్నారు. సంక్రాంతికి ఉద్యోగులకు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న డీఏలలో ఒక డిఏ చెల్లిస్తామని ముఖ్యమంత్రి తమతో చెప్పినట్లు మీడియా సమావేశంలో వెల్లడించడం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు పెన్షనర్లకు తీవ్ర ఆవేదనకు గురి చేశారని పేర్కొన్నారు. జేఏసీ నేతలు తమ ఆధిపత్య ధోరణి, ప్రభుత్వం దగ్గర మెప్పుకోసం అరాట పడుతున్నారు తప్ప ఉద్యోగుల ప్రయోజనాలు, ఆత్మగౌరవం కాపాడేలా వ్యవహరించకపోవడం బాధాకరమన్నారు.. జెఏసినేతల వైఖరి వల్ల ప్రభుత్వం పట్ల, సంఘాల పట్ల ఉద్యోగులలో నానాటికి నమ్మకం సన్నగిల్లిపోయేలా ఉందని ఆక్షేపించారు. సంక్రాంతికి ఒక డిఏ చెల్లిస్తామంటూ సీఎం నేతలతో చెప్పి మాట తప్పారో, ముఖ్యమంత్రి చెప్పకపోయినా నేతలే మీడియా ముందుకు వచ్చి అబద్దాలు చెప్పారో స్పష్టం చేయాల్సింది బాధ్యత ప్రభుత్వంపై ,జేఏసీ నేతలుపై ఉందని తెలిపారు. జేఏసీ నేతలకు చేతనైతే ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేసేలా ముఖ్యమంత్రి, ఇతర ఉన్నతాధికారులతో స్పష్టమైన ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. అంతేకానీ ఉద్యోగుల సమస్యలు తీర్చకపోగా వాళ్ల మనోభావాలు దెబ్బతీసేలా ప్రకటనలు చేయొద్దని హితవు పలికారు.. ఈ కార్యక్రమంలో నేతలు చింతల శ్రీనివాసరావు, మేడేపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతిలో ఉద్రిక్తత

విశాలాంధ్ర-గుడివాడ : ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో ఉద్రిక్త వాతావరణం దారితీసింది. బుధవారం ఎన్టీఆర్ స్టేడియం వద్ద రావి వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు

అర్పిస్తున్న తరుణంలో అటుగా కొంతమంది వైకాపా కార్యకర్తలు జూనియర్ ఎన్టీఆర్ ఫోటోలు పెట్టుకుని భారీ ర్యాలీ నిర్వహించుకుంటూ రావడంతో ఒక్కసారిగా ఇరు పార్టీల కార్యకర్తలు హోరాహోరి నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో ఒకానొక పరిస్థితిలో ఎన్టీఆర్ విగ్రహం సాక్షిగా ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. కార్యకర్తలు సమన్వయం పాటించకుండా కవ్వింపు చేష్టలకు దిగడంతో ఇటు టిడిపి కార్యకర్తలను వైకాపా కార్యకర్తలను పోలీసులు పంపించివేశారు.

ఎస్‌డీజీపై సమీక్ష నిర్వహించాలి

ఎంపీడీవో శేషగిరిరావు

విశాలాంధ్ర-ఉంగుటూరు : ఉంగుటూరులో సచివాలయ సిబ్బంది, అంగన్ వాడి సిబ్బందితో ఎంపీడీఓ జివిఎస్‌వి శేషగిరిరావు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి సోమవారం స్పందన, ఎస్‌డీజీపై సమీక్షా నిర్వహించాన్నారు. రక్తహీనత కలిగిన మహిళలు, పిల్లలను సర్వే చేసి, వారికి మంచి పోషకాహారం, రోగనిరోధకత అందే విధమగా ఎప్పటికప్పుడు చూడాలన్నారు. విస్తరణాధికారి ఎం.అమీర్‌బాష మాట్లాడుతూ రోగనిరోధకత కమ్యూనిటీల ఆరోగ్యాన్ని కాపాడుతుందని, పేదరికంలోకి నెట్టబడిన వ్యక్తుల సంఖ్యను తగ్గిస్తుందన్నారు. ఈ కార్యక్రమములో ఈఓపీఆర్‌డీ అమీర్ బాష, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొనారు.

అంకమ్మ వెండి తాపడంకు రూ.10,116

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : స్థానిక తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలోని అంకమ్మ అమ్మవారి దేవాలయం వెండి తాపడం తయారు చేయు నిమిత్తం నందిగామ పట్టణమునకు చెందిన మాజేటి అనిల్ కుమార్.పదివేల 116 రూపాయలు విరాళంగాఆలయ అధికారులకు అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్ధ ప్రసాదములు అందజేశారు.

పేదల పక్షపాతి ఎన్టీఆర్

విశాలాంధ్ర-కృత్తివెన్ను : ఎన్టీఆర్ పేదల పక్షపాతి అని పేదలకు పట్టెడు అన్నం పెట్టిన మహానేతని పెడన తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జీ కాగిత కృష్ణప్రసాదు అన్నారు. మండలంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యండపల్లి గ్రామంలో పెద్దఎత్తున అన్నధాన కార్యక్రమం నిర్వహించారు. కాగిత మాట్లాడుతూ తెలుగుజాతీ అత్మగౌరవాన్ని చాటిన మహనేత ఎన్టీఆర్ అన్నారు. ఈ కార్యక్రమాలలో మండల పార్టీ అధ్యక్షుడు ఒడుగు తులసీరావు, కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య, బస్వాని బంగార్రాజు, కూనసాని చిన్నా, కొప్పర్తి బాబి, కూనసాని శ్రీనివాసరావు, జోన్నాల జయరాజు, పులగం చిన్నబ్బులు, నక్కా రాజారావు, రావూరి తాతాజీ, బస్వాని నీలాజలం, నడకుడిటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సైకిళ్ళు పంపిణీ

విశాలాంధ్ర-చల్లపల్లి : పురిటి గడ్డకు చెందిన ఇండియా విలేజ్ మినిస్ట్రస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దైవ సేవకులకు సైకిళ్ళు పంపిణీ చేశారు. 40 మంది దైవ సేవకులకు గాను రూ.2.30 లక్షల విలువైన సైకిళ్లను ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డా.వేములపల్లి సురేష్ ఐవీఎం హోమ్ వద్ద బుధవారం అందజేశారు. సురేష్ మాట్లాడుతూ దైవ సేవకులకు వారి అవసరార్థం తమ సంస్థ ద్వారా సైకిళ్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. సైకిళ్లను అందించిన సురేష్ కు దైవ సేవకులు కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘాన్ని రాజకీయ పార్టీగా తీర్చిదిద్దుదాం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు

విశాలాంధ్ర- ఘంటసాల: బీసీ సంక్షేమ సంఘాన్ని ఒక రాజకీయ పార్టీగా తీర్చి దిద్దుతామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసాని శంకర్రావు పేర్కొన్నారు. మండల మండల కేంద్రమైన ఘంటసాలలో జరిగిన బీసీ లా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ స్వాతంత్యం వచ్చి 70 సంవత్సరాలవుతున్నా బీసీలు పల్లకీ మోసే వారిగానే ఉన్నారని, రేపటి తరం వారిని పల్లకిలో కూర్చోబెట్టేందుకు ఉద్యమాలు, పోరాటాలు చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మన కులాన్ని, బీసీ వర్గాన్ని గౌరవించుకోవాలని, శాసించే స్థాయిలోకి ఎదగాలన్నారు. మన ఓట్లతో గెలిచిన నాయకులను యాచించే స్థితిలో మనం ఉంటున్నామని, కనీసం కమ్యూనిటీ హాలు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు కోసం బతిమాలుకోవటం దారుణమైన పరిస్థితి అన్నారు. రాజ్యాంగ బద్ధంగా వచ్చిన హక్కులను కాపాడుకోవటానికి ఉద్యమాలు, పోరాటాలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. దేశ సంపదను కూడా మనమే సృష్టిస్తున్నామని, చేనేత, గీత, మత్యకారులు ద్వారానే ఆదాయం లభిస్తుందని, కార్పొరేట్ శక్తులు మన పనిని లాక్కుంటున్నాయని, బీసీ వర్గీయులు దేశవ్యాప్తంగా అభ్యున్నతి చెందాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ జనాభా గురించి ఎవరిని అడిగినా సమాధానం చెప్పటం లేదని, కుల గణన చేయాలని కోరుతున్నప్పటికీ ఏ ప్రభుత్వాలు చేయకపోవటంతో ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కులగణన చేస్తే మనం సీట్లు అడుగుతామనే భయంతో ప్రభుత్వాలు కులగణన చేయకుండా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. కాపులు కూడా బీసీ రిజర్వేషన్ అడగటం సబబు కాదని, చాలా కమిషన్లు కాపులను బీసీలోకి చేర్చే అవకాశం లేదని స్పష్టంగా చెప్పాయని గుర్తు చేశారు. ఓటు హక్కును రూ.1000 నుంచి 2 వేలకు అమ్ముకోకుండా సరైన నాయకులను ఎన్నుకోవటం ద్వారా బీసీలు సముచిత స్థానంలో ఉంటారన్నారు. జిల్లా అధ్యక్షులు అందే జగదీష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీలు, అణచివేతకు గురవుతున్నారని, బీసీలు సైతం రాజ్యాధికారం పొందేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం ద్వారకా శ్రీను, నేతలు మురాల వాసుదేవ, అత్కూరి సీతారామరాజు, విట్టంశెట్టి దుర్గారావు, నందం వెంకట్రాది, ఉడతా చిత్రరంజన్ సాయి, జంజనం రామ్మోహనరావు, డొకిపర్తి సుబ్బారావు, విట్టంశెట్టి సుధాకర్, తుమ్మలచర్ల రాము, గుండు శ్రీను, మురుగుడు నాంచారయ్య, కొడాలి శ్రీకాంత్, కొణతం శ్రీనివాసరావు, ట్రైలర్ శ్రీను, గోలి వెంకటేశ్వరరావు, బందారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

విశాలాంధ్ర-మచిలీపట్నం : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి వర్యులు పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారకరామారావు 27వ వర్ధంతి సందర్భంగా మచిలీపట్నం బస్టాండ్ వద్ద గల ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించిన కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళనారాయణరావు మాజీ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర,మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ గారు.తదుపరి తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యాలయం నందు లెజెండరీ బ్లడ్ డొనేషన్ క్యాంపు ప్రారంబించారు అంతరం బస్సు స్టాండ్ వద్ద పేదవారికి నిరాశ్రయులకు అన్నదానం నిర్వహించారు.ఈ సందర్భంగా కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ సినీ రాజకీయ రంగంలో విశ్వవిఖ్యాత నట సార్వభౌముడుగా అన్న ఎన్టీఆర్ వెలుగొందారన్నారు. తెలుగుదేశం పార్టీ పేదల పార్టీగా చరిత్రకెక్కించి ఎందరో పేదలపాలిటీ పెన్నిధిగా ఎన్టీఆర్ చరిత్రలో నిలిచిపోయారన్నారు .తెలుగుజాతి కీర్తిని ప్రపంచ చిత్రపటంలో నిలిపిన ఖ్యాతి ఎన్టీఆర్ దే అన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు తెలుగుదేశం సైనికులంతా కృషి చేస్తామని,తెలుగువారి ఆత్మగౌరవానికి ఎన్టీయార్ ప్రతీక అన్నారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూఎన్టీఆర్ యుగపురుషుడని తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడే ఒక ధీరుడని కొనియాడారు సమాజమే దేవాలయం పేదల్లే దేవులు అని చెప్పిన మహానుభావుడు.కృష్ణాజిల్లా ముద్దుబిడ్డ అన్న నందమూరి తారకరామారావు సామాన్య రైతుబిడ్డగా పుట్టి వెండితెర దేవుడై వెలిగి మనిషి ఎదగడానికి పట్టుదల, కృషి ఉంటే చాలని ఆయన నిర్మించారన్నారు. ఈ సందర్భంగా బూరగడ్డ వేదం వ్యాస్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పని చేసిన మహానుభావుడు స్వర్గీయ నందమూరి తారకరామారావుని, వారి ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోపిచంద్, కొనకళ్ల బుల్లయ్య, గోపు సత్యనారాయణ, బాబా ప్రసాద్, కుంచె నాని, ఇలియాస్ పాషా, కార్యదర్శి వెంకన్న, కాగిత వెంకటేశ్వరరావు, లంకె నారాయణ ప్రసాద్, మరకని పరబ్రహ్మాము, బొడ్డు నాగరాజు, సమత కీర్తి, అక్కుమహంతి రాజు, రాళ్లకొట్టు రాము, దేవరపల్లి అనిత, దిటకుర్తి సుధాకర్, కొక్కిలిగడ్డ రమేష్, లంకిశెట్టి నీరజ, పాలపర్తి పద్మ, నాంచారయ్య, గోపాల్ రావు, గుండుపాలెం బసయ్య, చిన్ని, నీలం రామకృష్ణ, , దిలీప్, బత్తిన దాసు, లంకె శేషగిరి, అక్బర్ అలీ, వాసు, వేణు, రమేష్, ఈమని నారాయణ, సలీమ్, తదితరులు పాల్గొన్నారు.

నివేశన స్థలాల కోసం ఎదురు చూస్తున్న పేదలు

సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : జగనన్న ప్రభుత్వం 33 లక్షల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించినప్పటికీ ఇంకా నివేశన స్థలాల కోసం ఎదురుచూస్తున్న పేదలు ఉన్నారని, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. సీపీఐ బృందం బుధవారం ఇబ్రహీంపట్నం జగనన్న కాలనీ, ఇసుక పడవల రేవు, పశ్చిమ, తూర్పు, సెంట్రల్ ఇబ్రహింపట్నం ప్రాంతాల్లో పర్యటించి జగనన్న ఇళ్ల లబ్ధిదారులతో కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల 17వ తేదీ నుంచి లబ్ధిదారుల సర్వే నిర్వహిస్తున్న సందర్భంలో అనేక వాస్తవాలు బయటపడ్డాయని అన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రకటించిన రూ. 1.80 లక్షలు ఏమాత్రం సరిపోవని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లను అన్ని మౌలిక సదుపాయాలతో సత్వరమే పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. రూ.5 లక్షలు కేటాయించి తమ సొంతింటి కలను నెరవేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేష్, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కన్నా వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు శంకర్, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి

విశాలాంధ్ర-తిరువూరు: జగనన్న గృహసంకల్ప పథకం కింద చేపట్టిన జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీ బాధిత లబ్ధిదారుల పక్షాన సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మండలంలోని పెద్దవరంలో సీపీఐ పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. భారత కమ్యునిస్టు పార్టీ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తిరువూరు మండల కమిటీల ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వేంకటేశ్వర మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో అంతర్గత రహదారులు, డ్రేనేజీలు, కరెంట్, వీధి లైట్లు వంటి కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. జగనన్న కాలనీ లబ్ధిదారులకు రూ. 1.80 లక్షలకు బదులుగా రూ 5 లక్షలు చెల్లించాలని, నివేశన స్థల విస్తీర్ణం పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇవ్వాలని కోరారు. పక్కా గృహాల నిర్మాణ పనులు కూడా ప్రభుత్వమే పూర్తి చేసి, లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెల 17 నుంచి 30 వరకు సంతకాల సేకరణ, 30న మండల, నియోజకవర్గాల, జిల్లా కేంద్రాలలో బాధితులతో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని, ఫిబ్రవరి 6న కలెక్టరేట్ ల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని చిలుకూరి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎన్ వనమాలి, పి.రవి, ఎం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

సీపీఐ సీనియర్ నాయకులు రావి బాబూరావు మృతికి

సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సమితి సంతాపం

విశాలాంధ్ర-విజయవాడ : దివి ఏరియా సీపీఐ సీనియర్ నాయకులు, అవనిగడ్డ నియోజకవర్గ కార్యదర్శిగా, కృష్ణాజిల్లా సమితి కార్యవర్గ సభ్యునిగా, ప్రజానాట్య మండలి జిల్లా నాయకునిగా సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వహించిన రావి బాబూరావు అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన మరణం కమ్యూనిస్టు పార్టీకి, ప్రజాసంఘాలకు తీరనిలోటని పేర్కొన్నారు. బాబూరావు మృతికి సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సమితి తరుఫున ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. బాబూరావు కుటుంబానికి సానుభూతి తెలిపారు.

ఎన్టీఆర్‌కు కలెక్టర్ ఘన నివాళులు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : సామాన్య రైతు కుటుంబంలో పుట్టి, సినీ రంగంలో విభిన్న పాత్రల్లో నటించిన మకుటంలేని మహారాజు స్వర్గీయ ఎన్టీఆర్ రాజకీయ నాయకుడిగా పేద, బలహీన వర్గాల ప్రజలకు వినూత్నమైన పథకాలను అమలు చేసి వారి హృదయాల్లో చిరస్మరణీయులుగా నిలిచారని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ఎన్టీఆర్ 27వ వర్ధంతి సందర్భంగా స్థానిక కలెక్టర్ కార్యాలయంలో బుధవారం కలెక్టర్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రవాణా సౌకర్యాలు సాకుగా చూపించి

మండల కేంద్రం మార్పు న్యాయమా....?

విశాలాంధ్ర-వీరులపాడు: మండల కేంద్రాన్ని వీరులపాడు లోని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ 34వ రోజు రిలే నిరాహార దీక్షలో వీరులపాడు గ్రామ మహిళలు బుధవారం పాల్గొన్నారు.రవాణా సౌకర్యాన్ని సాకుగా చూపించి మండల కేంద్రాన్ని వీరులపాడు నుండి జుజ్జూరు గ్రామానికి మార్చటం ఎవరి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమని, ఇది న్యాయమా అని వీరులపాడు గ్రామ మాజీ సర్పంచ్ , సీనియర్ సిపిఐ నాయకులు వట్టి కొండ చంద్రమోహన్ ప్రశ్నించారు. ఈ రిలే నిరాహార దీక్షలో షేక్ జాన్ బీ,షేక్ గాలిబ్ బీ,షేక్ మస్తాన్ బీ,షేక్ రజియా బేగం,పాలవాయి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అవగాహన కల్పించాలి: డీఎంహెచ్‌ఓ సుహాసిని

విశాలాంధ్ర-వీరులపాడు: ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాచర్ల సుహాసిని వీరులపాడు మండలం అల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోగల రంగాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రాం ను బుధవారం పరిశీలించారు. ఎఫ్ పి సి ప్రోగ్రాం ఫలితాలను క్షేత్రస్థాయిలో గ్రామస్తులకు అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలు, బాలింతల ఆరోగ్య స్థితి గురించి వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి గర్భిణీ స్త్రీ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అయ్యేలా వారికి అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్పందన, ఎం పి హెచ్ సూపర్వైజర్ వెంకటేశ్వర రెడ్డి, ఎంపీహెచ్ఈఓ చంద్రశేఖర్ తదితరు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర -రెడ్డిగూడెం : ధాన్యం కాటా వేయండి మహా ప్రభో.... అరుగాలం కష్టించి చెమటోడ్చి పండించిన పంటను 70 రోజులు గడచినప్పటికీ తామ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రెడ్డిగూడెం మండలం కూనపరాజుపర్వ గ్రామానికి చెందిన రైతులు బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేసి, ధాన్యం కొనాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ పాల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. తహశీల్దార్ పాల్ మాట్లాడుతూ సివిల్ సప్లయ్ అధికారులు మరి ఉన్నతాధికారులు దృష్టికి సమస్యను తీసుకువెళ్లి త్వరగా తమ ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపడతామని రైతులకు తెలిపారు. మరో రెండుమూడు రోజుల్లో తమ ధాన్యాన్ని ప్రభు త్వం కొనుగోలు చేయకపోతే తహశీల్దార్ కార్యాలయం వద్ద ధాన్యాన్ని తరలించి ఆందోళన ఉధృతం చేస్తామని రైతులు తెలిపారు. ఈ కార్యక్ర మంలో పొన్నగంటి నరసింహారావు, సూరిశెట్టి కృష్ణారావు, మంగరాజు, లక్ష్మీబాబు, దాకార సత్యనారాయణ, దాకారపు సురేష్ రైతులు పాల్గొన్నారు.

క్షతగాత్రుని ప్రాణాలు కాపాడిన సీఐ భీమరాజు

విశాలాంధ్ర-తిరువూరు: మండలంలోని లక్ష్మీపురం గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని తిరువూరు సీఐ భీమరాజు సకాలంలో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. విసన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి నుంచి తిరువూరు ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇడుపులపాటి సర్వేశ్వరరావు అదుపుతప్పి పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తున్న తిరువూరు సిఐ ఆర్ భీమరాజు, ఎస్సైలు దుర్గాప్రసాద్, పద్మారావు లు సకాలంలో స్పందించి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతనిని పోలీస్ వాహనంలో హుటాహుటిన తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సర్వేశ్వరరావు కు సకాలంలో వైద్య సేవలు అందించడంతో ప్రాణాలు కాపాడగలిగినట్లు సిఐ భీమరాజు తెలిపారు. పోలీసులు స్పందించిన తీరును చూసి పలువురు పోలీస్ సిబ్బందిని అభినందించారు.

కోడి పందేలపై ఉక్కుపాదం

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: సంక్రాంతి ముసుగులో అసాంఘిక కార్యకలాపాల పై ఎన్టీఆర్ జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతి రాణా ఆదేశాల మేరకు మైలవరం, నందిగామ, విజయవాడ రూరల్ ఏసీపీల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈనెల 14వతేదీ నుండి 17తేదీ వరకు జిల్లాలో జరిగిన కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. 480 మందిని అదుపులోకి తీసుకుని 180 కేసులు నమోదు చేశారు. అదుపులో తీసుకున్న వారి వద్ద నుండి రూ.1.76లక్షలు నగదు, 6వాహనాలు, 170 కోడి పుంజులు, 182 కోడి కత్తులు స్వాధీనం చేసుకుని చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. పేకాట, కోడి పందేలు, అసాంఘిక జూద కార్యకలాపాలు ఏర్పాటు చేసిన ప్రదేశాలను ధ్వంసం చేసి కట్టడి చేశారు.

రామచంద్రపురంలో చోరీ

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: కలగర పంచాయతీ శివారు రామచంద్రపురంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన బుధవారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన దొడ్డా చెన్నారెడ్డి, అతని భార్య భారతి ఈనెల 9వ తేదీన ఇంటి నుంచి బంధువుల ఇంటికి వెళ్లారు. 18వ తేదీన ఇంటికి చేరుకుని, పరిశీలించగా, అప్పటికే ఇంట్లో ఉన్న బంగారునగలు, నగదు చోరీకి గురైన విషయాన్ని గుర్తించామని భారతి తెలిపారు. ఈ మేరకు ఆమె విస్సన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వంద ట్రాక్టర్లతో ప్రదర్శన నిర్వహిస్తాం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న రైతువ్యతిరేక విధానాలపై దేశ వ్యాప్త పిలుపు మేరకు ఈనెల 26వ తేదీన విజయవాడలో పెద్దఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు అఖిలభారత కిసాన్ మహాసభ జాతీయ కార్యదర్శి డి.హరినాథ్ తెలిపారు. రిపబ్లిక్ దినోత్సవం రోజున వంద ట్రాక్టర్లతో ఈ ప్రదర్శన కొనసాగుతుందని ఆయన తెలిపారు. ప్రధాని మోదీ రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చకపోగా, వ్యవసాయ విద్యుత్ మీటర్ల ఏర్పాటు వంటి పలు వ్యతిరేక చర్యలకు పాల్పడినట్లు ఆయన ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

వేణుగోపాల స్వామి హుండీ ఆదాయం రూ.24.55 లక్షలు

విశాలాంధ్ర-గంపలగూడెం : వేణుగోపాల స్వామి దేవాలయ హుండీని బుధవారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కే శాంతి, ఈవో ఎన్ వి సాంబశివరావు, గన్నవరం దేవాదాయ శాఖ అధికారి ఏ శ్రీనివాస్ ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కావూరి శశిరేఖ ఆధ్వర్యంలో తెరిచి లెక్కించగా స్వామివారి హుండీలో, అన్న ప్రసాదం హుండీలో, గోశాల హుండీలో మొత్తం రూ.24 లక్షల 55, వేల 516 వచ్చాయి. బంగారం 53 గ్రాములు వెండి 9 కిలోల 613 గ్రాములు వచ్చినవి. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చక బృందం, సత్య సాయి సేవ సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆపార్టీ నేతలు, కార్యకర్తలు విస్సన్నపేట మండలంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో మండలపార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు మట్టా వేణుగోపాలరావు, ఆకుల రాధాకృష్ణ, మండల నాయకులు నెక్కళపు వెంకటేశ్వరరావు, నెక్కళపు శ్రీనివాసరావు, నాదెళ్ల నాగమణి, సాంబారు నాగలక్ష్మి, ఆరికపూడి వీరయ్యచౌదరి, తుమ్మలపల్లి అనిల్, పాల్గొన్నారు.

సరికొత్త కథాంశంతో 'శుభస్య శీఘ్రం' మీ జీ తెలుగు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఎప్పటికప్పుడు సరికొత్త కంటెంట్తో భిన్నమైన సీరియల్స్తో తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న ఛానల్ 'జీ తెలుగు'. కొత్తదనం నిండిన కామెడీ, డాన్స్, సింగింగ్ షోలు, ఆసక్తికర మలుపులతో సాగుతున్నసీరియల్స్ టెలివిజన్ రంగంలో దూసుకుపోతోంది. అదే ఉత్సాహంతో నూతన సంవత్సర, సంక్రాంతి కానుకగా ఇప్పుడు 'శుభస్య శీఘ్రం' అంటూమరో కొత్త సీరియల్తో మీ ముందుకు రాబోతోంది. ఇది ఆర్థిక అసమానతలు, ఆత్మాభిమానం మధ్య జరిగే సంఘర్షణగా తెరకెక్కుతున్న ప్రేమకథ. మహేష్ బాబు- కృష్ణప్రియ ప్రధాన పాత్రలలో నటించిన 'శుభస్య శీఘ్రం' ఈ నెల 23 నుంచి ప్రతిరోజూ రాత్రి 7 గంటలకు ప్రసారం కానుంది.

పశ్చిమ టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఎన్టీఆర్ 27వ వర్ధంతి సందర్భంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ, లెజెండరీ బ్లడ్ డోనేషన్ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని), మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్‌లు హాజరయ్యారు. తెలుగు యువత రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం.ఎస్ బేగ్, రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి శ్రీనివాస్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు సుకాసి కిరణ్, ఎన్టీఆర్ జిల్లా కార్యాలయం కార్యదర్శి సారిపల్లి వెంకట రాధాకృష్ణ, సీనియర్ నాయకులు ధనేకుల వెంకట సుబ్బారావు, జిల్లా పార్టీ కార్యదర్శి పళ్ళంటి గంగాధర్, నీలం వెంకట నారాయణ, మాజీ కార్పొరేటర్ సుకాసి సరిత, జిల్లా వాణిజ్య విభాగం నాయకులు సోలంకి రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 300 కిలోమీటర్ల పాదయాత్ర చేస్తా : ఉమా

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : పేదవాడి వద్దకు ప్రజాప్రతినిధులను తీసుకెళ్లింది ఎన్టీఆర్‌ని ఆయన ఆశయాలే దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు అజెండా అని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి, కొండపల్లి మున్సిపాలిటీలలో నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా రక్తదానం చేశారు. జగన్ రెడ్డి ఎన్ని తప్పుడు ఆర్డర్లు ఇచ్చినా యువగళం ఆగదని, నియోజకవర్గంలో 300 కిలోమీటర్ల పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. చింతలపూడి ఎత్తిపోతల ద్వారా గోదావరి నీళ్ళు మన ప్రాంతానికి తీసుకురావడమే ఆయన జీవిత ఆశయం అన్నారు. పసుపుజెండా కప్పుకునే చస్తా అని స్పష్టం చేశారు. జంపాల సీతారామయ్య రామినేని రాజా చుటకుదురు శ్రీనివాసరావు, కొండపల్లి మున్సిపల్ టిడిపి కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బిల్డింగ్ మెటీరియల్‌లో కనిపించనున్న వృద్ధి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): బిల్డింగ్ మెటీరియల్ పరిశ్రమ పుంజుకున్న సంవత్సరంగా 2022 నిలిచింది. మౌలిక సదుపాయాల అభివృద్ధిపై అధికంగా దృష్టి సారించడంతో పాటుగా రియల్ ఎస్టేట్ ఆస్తులను సొంతం చేసుకోవాలనే కోరిక వంటివి ఈ పరిశ్రమ అత్యున్నతంగా పుంజుకోవడానికి సహాయపడింది. ఈ రంగం 2022లో 10 శాతం వృద్ధిని నమోదుచేసింది. 2023లో ఈ పరిశ్రమ గణనీయమైన వృద్ధి దిశగా పయనించడమే కాదు, మందగమన సంకేతాలూ కనిపించడంలేదు. మొత్తంమ్మీద ఆర్థికాభివృద్ధికి బిల్డింగ్‌మెటీరియల్ రంగం వృద్ధి కూడా అత్యంత కీలకంగా మారింది. మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగామ్ ఇంప్లిమెంటేషన్ (ఎంఓఎస్‌పీఐ) యొక్క ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్ మానిటరింగ్ డివిజన్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం మే 01, 2022 నాటికి దేశంలో 1559 ప్రాజెక్టులు పలు దశలలో ఉన్నాయి. వీటి మొత్తం విలువ 26.7 ట్రిలియన్ రూపాయలు (352.3 బిలియన్ డాలర్లు). వీటిలో కొన్ని ప్రాజెక్టులు దాదాపుగా పూర్తి కావొస్తున్నాయి. అవి అత్యంత ప్రధానమైన ప్రాజెక్టులు కావడం, అవి ఇంకా అభివృద్ధి దశలో ఉండటం వల్ల బిల్డింగ్ మెటీరియల్ పరిశ్రమకు భారీ అవకాశాలు సైతం లభిస్తున్నాయని అపర్ణ ఎంటర్‌ప్రైజస్ లిమిటెడ్ అంచనా వేస్తోంది.

రూ.18,999 ధరతో ఒప్పో ఆల్-రౌండర్ ఎ78 5జి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రముఖ గ్లోబల్ స్మార్ట్ డివైజ్ బ్రాండ్ ఒప్పో, భారతదేశంలో ఎ78 5జి ఆల్ రౌండర్ స్మార్ట్ ఫోన్ ను రూ. 18,999 ధరతో విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నూతన పరికరం 5జి సాంకేతికతలలో ఒప్పో నైపుణ్యంతో అభివృద్ధి చేయగా, జియో, వోడాఫోన్ మరియు ఎయిర్‌టెల్ (ఎస్‌ఏ, ఎన్‌ఎస్‌ఏ నెట్‌వర్క్‌లలో) సహా అన్ని భారతీయ సర్వీసు ప్రొవైడర్ల సేవలను అందుకునేందుకు అనుకూలంగా ఉంటుంది. ఒప్పో ఎ78 5జి ఒప్పోకు ప్రత్యేకమైన ఫాస్ట్ ఛార్జింగ్ టెక్నాలజీతో దాదాపు 60 నిమిషాలలో పూర్తిగా ఛార్జ్ అయ్యే అధిక-సామర్థ్యం కలిగిన 5,000ఎంఏహెచ్ బ్యాటరీతో వస్తుంది. ఇది రోజువారీ వినియోగాన్ని 23 గంటల వరకు అనుమతిస్తుంది. బ్యాటరీ ఛార్జ్ తక్కువగా ఉన్నప్పుడు అత్యవసర పరిస్థితుల్లో బ్యాటరీ శక్తిని ఆదా చేసేందుకు వినియోగదారుడు దాని సూపర్ పవర్ సేవింగ్ మోడ్‌ను యాక్టివేట్ చేయవచ్చు.

అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ మల్లికార్జునరావుకు పదోన్నతి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : విజయవాడ డివిజన్‌లో రైల్వే వేగన్ డిపోలో సీనియర్ సెక్షన్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ మల్లికార్జునరావు పదోన్నతి పొంది సన్మానం అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీరుగా నియమితులయ్యారు. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్‌సిఅండ్ డబ్ల్యుబ్రాంచ్ కార్యదర్శి కర్నూలు సుకుమార్ కార్యవర్గ సభ్యులు సన్మానించారు. ఆయన 2011లో జూనియర్ ఇంజనీర్‌గా వేగన్ డిపోలో కెరీర్ ప్రారంభించి సీనియర్ సెక్షన్ ఇంజనీర్ గా,ఏరియా ట్రైనింగ్ సెంటర్ చీఫ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎదిగి నేడు అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్గా పదోన్నతి పొందారు. చైర్మన్ వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు మణికుమార్, సుబ్రహ్మణ్యం,హైమావతి మునీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

34వ డివిజన్‌లో ఎన్టీఆర్ వర్ధంతి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ 34వ డివిజన్ లోని మజీద్ సెంటర్లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్. హబీబ్, ఎస్సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పరిసిపోగు రాజేష్, డివిజన్ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ జీవిత విశేషాలను నేతలు గుర్తు చేసుకున్నారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ ఉపాధ్యక్షుడు ఏకుల రత్నం, ఆరవ పెరుమళ్ళు, కురుచేటి శ్రీనివాసరావు, సత్యాల దుర్గారావు, ఆర్. రమేష్, షేక్. మున్నిసా, వై. పోలమ్మ, సీతాపతి దీనా వై. సాంబ, తెలుగు యువత నేతలు సయ్యద్ ఫయాజ్ హుస్సేన్, హర్ష నాయక్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా అన్నదానం

విశాలాంధ్ర-వీరులపాడు: నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్థానిక తెదేపా నేతలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి అల్లూరులో బుధవారం నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ లెజెండరీ బ్లడ్ బ్యాంక్‌ను సందర్శించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాస్, కొప్పుల కోటిరెడ్డి, దాములూరి మధు, కాపా రాంబాబు, చీదిరాల భరత్ రెడ్డి, విలాసాగరపు మల్లి, ఒబ్బిరెడ్డి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర- కంచికచర్ల: పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పరిపాలించిన మహనీయుడు ఎన్టీఆర్ అని మండల అధ్యక్షుడు కోగంటిబాబు పేర్కొన్నారు. స్థానిక స్థానిక పార్టీ కార్యాలయం నుంచి పార్టీ నాయకులతో కలిసి చెవిటికల్లు సెంటర్ వరకు ర్యాలీగా వచ్చి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పేరకలపాడు సర్పంచ్ మన్నేసాత్విక, పెండ్యాల సర్పంచ్, నాగవరపు జ్యోతి, ఆర్ఎస్ ప్రసాద్,వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నన్నపనేని లక్ష్మీనారాయణ, అన్నదాత కృష్ణ, బర్రె శంకర్రావు, బాణావత్ సైదులు, సుధాకర్, బుద్ది సూర్య ప్రకాష్, దిలావర్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం గదులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-వీరులపాడు: క్రాంతి కరుణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాశయ్య నిర్మల్ వృద్ధాశ్రమముకు గదుల నిర్మాణం కొరకు శంకుస్థాపన కార్యక్రమం నరసింహారావు పాలెంలో బుధవారం నిర్వహించారు. క్రాంతి కరుణ ఫౌండేషన్ ఫౌండర్ పసుపులేటి బ్రహ్మారావు మాట్లాడుతూ వృద్ధాశ్రమానికి భారీగా విరాళాలకు సేకరించుటకు అందరు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, ఎంపీటీసీ శీలం రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానంకు రూ.10 వేలు విరాళం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి నిత్య అన్నదాన పథకమునకు గుంటూరు జిల్లా పిడుగురాళ్ల మండలం చెన్నై పాలెంగ్రామ వాస్తవ్యులు ఎం రామకృష్ణ శివ పార్వతి దంపతులు పదివేల రూపాయలు విరాళముగా సమర్పించినారు వారికి ఆలయ అర్చకులు వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదములు అందజేశారు.

ఎస్సీ రైల్వేలో సరుకు రవాణాతో రూ.10,000 కోట్ల ఆదాయం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : దక్షిణ మధ్య రైల్వే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సరుకు రవాణా ద్వారా రూ.10,000 కోట్ల పైగా రాబడి సాధించినట్లు అధికారులు స్పష్టం చేశారు. కేవలం 9 నెలల 16 రోజులలోనే ఈ ఘనత సాధించినట్లు తెలిపారు.జోన్ ప్రారంభమైనప్పటి నుండి అత్యంత వేగవంతమైనది. అంతకుముందు అనగా 9 మార్చి 2019న 343 రోజులలో రూ. 10,000 కోట్ల సరుకు రవాణా రాబడిని సాధించింది. సరుకు రవాణా విభాగం నిరంతరం కృషి చేయడం వలన ఎస్సీ రైల్వే 100 మిలియన్ టన్నుల లోడింగ్ మార్కును దాటింది. సరుకు రవాణా యొక్క ఒరవడి ఆశాజనకంగా వుంది . ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి అత్యధిక సరుకు రవాణా లోడింగ్‌ను అనుకున్న లక్ష్యాలను సాధిస్తామనే నమ్మకం ఉందన్నారు.కొత్తగా సరకు రవాణాను ఆకర్షించడానికి,ఇతర రవాణా మార్గాలకు మళ్లించబడిన రవాణాను పునరుద్దరించడానికి జోన్ వ్యాపార అభివృద్ధికోసం ఏర్పాటుచేసిన యూనిట్లు ద్వారా అలాగే ఆపరేటింగ్ యూనిట్లు కమర్షియల్ అధికారులు,సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. సరుకు లోడింగ్‌లో ప్రధాన వస్తువు బొగ్గు. మొత్తం లోడింగ్‌లో 50% కంటే ఎక్కువ దోహదపడుతుండగా, సిమెంట్ 26% లోడింగ్కు దోహదం చేస్తుంది. దక్షిణ మధ్య రైల్వేకు ప్రధాన సరుకు రవాణా సింగరేణి కాలరీస్. దీనివల్ల థర్మల్ పవర్ ప్లాంట్లు మరియు సిమెంట్ ప్లాంట్లకు బొగ్గును రవాణా జరుగుతుంది. కోవిడ్ లాక్డౌన్ నుండి ఆహార ధాన్యాలు మరియు ఎరువుల లోడ్ గణనీయంగా పెరిగింది మరియు దేశవ్యాప్తంగా ఆహార సరఫరా గొలుసును సమతుల్యం చేయడంలో సహాయపడింది.సరకు రవాణా విభాగంలో రూ. 10,000 కోట్ల రాబడిని సాధించినందుకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఆపరేటింగ్,కమర్షియల్ విభాగాల బృందాన్ని అభినందించారు.

homefirst
We'll take you home

హోంఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్
CIN : U65990MH2010PTC240703,
Website : homefirstindia.com, Phone No : 180030008425
Email ID : loanfirst@homefirstindia.com

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8 యొక్క ఉప నిబంధన(1) కింద స్వాధీనత నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ నం.54 ఆఫ్ 2002) అండ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 3తో చదివే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద తెలిపిన పేరుతో ఉన్న మీరు/రుణగ్రహీతలకు **హోమ్‌ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** యొక్క అధీకృతఅధికారిగా దిగువ సంతకందారు, సంబంధిత నోటీసులు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా మొత్తం బకాయిలను చెల్లించవలసిందిగా పిలుపునిస్తూ ఈ కింద పేర్కొన్న సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది. మీరు/రుణగ్రహీతలంతా బాకీ మొత్తాన్ని నిర్దిష్ట సమయంలోగా తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సర్ఫేసీ చట్టం,2002 నిబంధనలు, సెక్షన్ 13 యొక్క ఉప సెక్షన్(4) యొక్క నిబంధన కింద కలిగియున్న అధికారాలను వినియోగించి **హోమ్‌ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** ఈ కింద పేర్కొన్న హామీగా పెట్టబడిన ఆస్తులను స్వాధీనం చేసుకోవడమైనది :

వ. సం.	రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు/ హామీదారులు పేరు	తనఖా పెట్టిన ఆస్తి వివరాలు	సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు తేదీ	డిమాండ్ నోటీసు తేదీ నాటికి మొత్తం బాకీ (రూ.ల్లో)	స్వాధీనతలోకి తీసుకున్న తేదీ
1.	రాచర్ల జ్యోతిష్, రాము రాచర్ల, లక్ష్మి రాచర్ల	ఫ్లాట్ నం.405, పెదెర్ల హోమ్స్, దగ్గరి డోర్ నం.4-90, ఆర్ఎస్ నం: 561, ఎల్‌పి నం:63/82, ఫ్లాట్ నం:9-25(ఐటెమ్ 1), ఫ్లాట్ నం.24 (ఐటెమ్ 2), గొల్లపూడి గ్రామ పంచాయతీ, విజయవాడ (రూరల్), ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-521225	10-11-2022	రూ.21,05,526	17-01-2023

రుణగ్రహీత బకాయి మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైనందున పేర్కొన్న నిబంధనల యొక్క నిబంధన 8తో చదివే సెక్షన్ 13 (4) కింద అతను/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించి, కింద వివరించిన ఆస్తిని పైన పట్టికలో పేర్కొన్న తేదీలో దిగువ సంతకందారు స్వాధీనపరుచుకున్నట్లు రుణగ్రహీత/హామీదారు మరియు సాధారణ ప్రజానీకానికి నోటీసు ఇవ్వడమైనది.

పైన పేర్కొన్న ఆస్తులు/హామీగా పెట్టిన ఆస్తులు లేదా వాటిలోని ఏదైనా భాగంతో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని మరియు ఆస్తితో ఎటువంటి లావాదేవీలైనా పైన తెలిపిన ఆస్తులు/హామీగా పెట్టిన ఆస్తులపై పేర్కొన్న మొత్తం, చెల్లింపు పూర్తయ్యేవరకు భవిష్యత్తు వడ్డీకి గాను **హోమ్‌ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** చార్జికి లోబడి ఉంటుందని ఇందుమూలంగా ప్రత్యేకించి **రుణగ్రహీత/హామీదారులు** మరియు **సాధారణ ప్రజలను** హెచ్చరించడమైనది. హామీగా పెట్టిన ఆస్తుల విమోచనకు అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ (13) యొక్క ఉప సెక్షన్(8) యొక్క నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది.

తేదీ : 19-01-2023, ప్రదేశము : విజయవాడ, సం/- అధీకృత అధికారి, హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్